క్లుప్తంగా

ఆదినిమ్మాయపల్లి ఆనకట్టపై బ్యారేజ్ నిర్మించాలి



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్టపై బ్యారేజీని నిర్మించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి కోరారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆది నిమ్మాయపల్లి ఆనకట్టపై బ్యారేజ్ నిర్మించాలని ఆందోళన కార్యక్రమం పెడితే ప్రస్తుతం కడప పార్లమెంటు అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా కడప ప్రజల చిరకాల కోరిక అయిన కడప ఉక్కు పరిశ్రమను స్థాపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, మగ్బూల్ బాష పాల్గొన్నారు.

నీట్ పరీక్షల అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నీట్ పరీక్ష ఫలితాల అక్రమాలపై విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాలెం హరి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన విద్యార్థులను మోసం చేసి బడా బాబుల విద్యార్థులకు బీజేపీ ప్రభుత్వం అమ్ముడుపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది మండలం సుషీల్ కుమార్, ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో రక్తదానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న డాక్టర్ గిరిధర్, వైద్యులు

కడప అర్బన్: అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) కడప బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ టి. గిరిధర్ ఆధ్వర్యంలో కడప బ్లడ్ బ్యాంక్‌లో కడప రిమ్స్, ఫాతిమా మెడికల్ వైద్య కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 32 యూనిట్ల రక్తదానం చేసి తమ మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, రిమ్స్ అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బద్రి శ్రీనివాసులు, డాక్టర్స్ అమానుల్లా, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సాదిక్, డాక్టర్ మధుసూదన్, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అన్ని అంశాల్లో అవగాహన అవసరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కార్యకర్తలు అన్ని అంశాల్లో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని శిశుగృహ మేనేజర్ కుమారి తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని కొండాయపల్లెలోగల మోడల్ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా నిర్వహించడం జరుగుతోందన్నారు. పిల్లలు లేని వారికి దత్తత అనేది ఒక వరం లాటిందన్నారు. అటువంటి వరాన్ని ప్రభుత్వం అందించడం సంతోషదాయకమన్నారు. ఎన్ఐసీ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ ప్రతిరూప్ మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబుచాన్ పాల్గొన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి



ఎమ్మెల్యే మాధవీరెడ్డికి పూల మొక్క అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీఓ నంబర్ 117ను రద్దు చేసే విధంగా ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకురావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబులు కోరారు. ఈ విషయమై శనివారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను మాతృభాషలోను, ఉన్నత విద్యను తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, అహ్మద్, ఆడిట్ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కష్టజీవుల ఐక్యత కోరిన శ్రీ శ్రీ

కడప కల్చరల్ : కష్టజీవుల ఐక్యత కోరిన సుప్రసిద్ధ కవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) అని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. సాహితీ స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్రీశ్రీ వర్ధంతి సభను స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య ఈశ్వర్‌రెడ్డి శ్రీశ్రీ కవిత్వం, సమకాలీనత అనే అంశంపై మాట్లాడారు. శ్రీశ్రీ కవిత్వం కార్మికులకు మార్చింగ్ బ్యాండ్‌లాగా పనిచేస్తుందన్నారు. నన్నయ, తిక్కన, ఎర్రన తెలుగు కవిత్రయం కాదని, ప్రస్తుత తరుణంలో శ్రీశ్రీ, వేమన, గురజాడలే కవిత్రయమన్నారు. రాజకీయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు నేటికీ నూతనంగా ఉన్నాయన్నారు. సాహితీవేత్త డాక్టర్ పొదిలి నాగరాజు మాట్లాడుతూ శ్రీశ్రీ కథలు కష్టజీవుల గురించే ఉన్నాయని, ఆయన డిటెక్టివ్ కథలు కూడా రాశారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కవులు తమ కవితలను వినిపించారు. వారందరికీ నిర్వాహకులు ప్రత్యేక బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక మహిళా నేత సునీత, రచయిత్రి అరుణ, సీపీఎం నాయకులు దస్తగిరి, రామ్మోహన్, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి

యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ రచనలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీ శ్రీ రచనలు అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు ఉత్తేజ భరితంగా, శ్రామిక వర్గానికి దగ్గరగా.. ముఖ్యంగా యువతను కదిలించే విధంగా ఉన్నాయన్నారు. అందుకే ఆయనను విప్లవ కవి అని కూడా అంటారన్నారు. ఆయన రచనలు చదివి ఎందరో స్ఫూర్తి పొందారని, ఇప్పటికీ పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర హక్కులైన విభజన హామీలు అయిన ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన రాయలసీమకు ప్యాకేజీ వంటి సాధన కోసం కృషి చేయాలని, కేంద్రంపై ఆ విధంగా ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నామన్నారు.



శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎటువంటి గుర్తింపు లేకుండా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆశా వర్కర్లు పని చేయడంవల్ల గ్రామీణ స్థాయిలో మాతా శిశు మరణాలు తగ్గాయి అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఆశా వర్కర్లు ఏఎన్ఎంలకు కూడా సహకరిస్తున్నారన్నారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి కుటుంబాలను వదిలి ఆశా వర్కర్లు పనిచేశారన్నారు. అర్హత కలిగిన ఆశాలను ఏఎన్ఎం లుగా ప్రమోషన్ ఇవ్వాలని, మెడికల్, మెటర్నటీ సెలవులు మంజూరు చేయాలని, నాణ్యమైన యూనిఫాం సరఫరా చేసి గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. సుభాషిని, ఎల్. శాంతి. ఏపీ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్రవంతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్. నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఆశా కార్యకర్తలకు మద్దతుగా సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్ఎంపీలకు శిక్షణతో కూడిన సర్టిఫికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎంపీల అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్: ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆర్ఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శనివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీలకు తగిన శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తామని జీవో నంబర్ 465 జారీ చేశారని, ఆయన మరణానంతరం ముఖ్యమంత్రి అయిన నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఆర్ఎంపీలకు శిక్షణ అయితే ఇచ్చారుగానీ పరీక్షలు నిర్వహించలేదన్నారు. కొత్తగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఆర్ఎంపీలకు శిక్షణ పూర్తయిన వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శిక్షణ తీసుకోని ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ విషయమై త్వరలో ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నౌషాద్ అలీ, అమీర్‌బాషా, రంగయ్య, గురుప్రసాద్ గౌడ్, రఫీ, అలీ, వీరభద్రుడు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్య శిక్షణ సంస్కృతికి నిదర్శనం

కడప కల్చరల్ : భారతదేశపు నృత్యరీతుల్లో ఒకటైన కూచిపూడి లాంటి సంప్రదాయ నృత్యం నేటి తరం బాలలకు నేర్పడం క్షీణించిపోతున్న మన సంస్కృతిని కాపాడుకోవడమేనని ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ ఆఫీషియల్ మహిళా విభాగం అధ్యక్షురాలు చప్పరపు నాగ పుష్పాంజలి అన్నారు. శనివారం కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన నాగ పుష్పాంజలి మాట్లాడుతూ నృత్య శిక్షణా శిబిరం నిర్వహించడం అభినందనీయమని, అందులో భాగంగా చిన్నారులకు కూచిపూడి నృత్యం నేర్పడం మన సంప్రదాయాలను నిలుపుకోవడమేనన్నారు. నెల రోజులపాటు జరిగిన ఈ శిబిరంలో 30 మంది బాలికలకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని, ఈనెల 6న శ్రీశైలం దేవస్థానంలో ఏర్పాటు చేసిన వారి నృత్య ప్రదర్శన పలువురి ప్రశంసలు అందుకుందని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం తల్లం సతీష్ మాట్లాడుతూ మన అమ్మవారిశాలలో సంప్రదాయ నృత్య శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి నృత్యం నేర్చుకున్న చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో రావడం అందరినీ ఆకర్షించింది. శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు అతిథులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా కడప యూనిట్ అధ్యక్షులు ఆకుల సత్యప్రసాద్, సలహాదారు ముచ్చర్ల వెంకట సుబ్బయ్య, మహిళా విభాగ్ ప్రతినిధులు, సంస్థ ప్రముఖులు సాధు జనార్దన్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం నేర్చుకున్న చిన్నారులతో అతిథులు, నిర్వాహకులు

ఆడపిల్లలను కాపాడుకుందాం

జమ్మలమడుగు : ఆడపిల్లలను కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. శనివారం పట్టణంలోని శంకర్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ రూంలో జరుగుతన్న స్కానింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడుపులో ఆడపిల్ల పెరుగుతుందని చాలా మంది గర్భస్థ శిశువులను అబార్షన్ ద్వారా తొలగిస్తున్నారని అలాంటి వారు ఎవరైనా ఆసుపత్రికి వస్తే వారికి వైద్యులు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వైద్యులు స్కానింగ్‌లో చేసి లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యానేరం అవుతుందన్నారు. వైద్యులు లింగ నిర్ధారణ చేసినట్లు అయితే వారికి జైలు శిక్షతోపాటు సర్టిఫికేట్‌లను రద్దుచేస్తారని హెచ్చరించారు.



సంధ్య వేళ.. రంగుల కళ

ప్రకృతి ఎంతో అందమైనది. ఆస్వాదించే మనసు ఉండాలే గానీ ప్రతీదీ అద్భుతమే. ఇక సూర్యోదయం.. సూర్యాస్తమయ సమయాన ఆకాశం వివిధ రంగులతో ఆకట్టుకుంటుంది. శనివారం కడప నగరంలో సంధ్యా సమయాన నింగి ఇలా లేత అరుణ వర్ణంతో మైమరపించింది. - కడప ఎడ్యుకేషన్

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



తిరునాలలో బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన శ్రీ కొత్తగంగమ్మ తిరునాల ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకు పూజ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఎద్దులచే బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూతాశ్రమం గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆలయంలో అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలతో పాటు, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజాకార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

ఏపీ మోడల్ స్కూల్లో దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో ఖాళీగా వున్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 18 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీగా వుందని తెలిపారు. అర్హత గలిగి ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు పాఠశాలలో స్వయంగా తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 23వ తేదీన స్థానిక పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. మార్కుల ఆధారంగా రిజర్వేషన్‌లను అనుసరించి సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ


చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలంలోని నాగిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా కిట్లను కమలాపురం ఎమ్మెల్యే పి.కృష్ణ చైతన్యరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయ్యాక మొదటి కార్యక్రమం విద్యార్థులకు విద్యా కిట్లను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బక్రీద్ ప్రార్థన వేళలు

కడప కల్చరల్ : పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఇందుకోసం ప్రతి మసీదు, ఈద్గాలలో ప్రత్యేక సమయంలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఆయా మసీదులు, అందులో ప్రార్థనా వేళలను నగర ముస్లింల సౌలభ్యం కోసం అందజేస్తున్నాం.

మసీదు/ఈద్గా పేరు	ప్రార్థనల సమయం
అమినీయా ఈద్గా, బిల్టప్	10.00
మురాదియా షాహి ఈద్గా, దండు	10.45
అస్తానె బొగ్దాదియా మసీదు, షాహిపేట	6.30
పెద్దదర్గా మసీదు, పెద్దదర్గా	9.45
ఏడురోడ్ల మసీదు, ఏడురోడ్లు	7.00
షహమీరియా మసీదు, రవీంద్రనగర్	7.00
గుంతబజారు మసీదు, ఎన్జీఆర్ సర్కిల్	9.00
జుమ్మామసీదు, వైవీ స్ట్రీట్	10.30
బహదూర్‌ఖాన్ మసీదు, బీకేఎం వీధి	10.30
అమీనియా మసీదు, పెద్దదర్గా	9.45
నకాష్ మసీదు, నకాష్‌వీధి	7.00
హబీబియా మసీదు, బళ్లారిరోడ్డు	7.30
బురానుద్దీన్ మసీదు, ట్రంకురోడ్డు	7.00
మద్దేఖాన్ మసీదు, చిలకలబావి	9.00
అల్మాస్‌పేట మసీదు, అల్మాస్‌పేట	9.00
హుసేనియా మసీదు, అగాడి	9.30
తిమ్మర్‌జీ మసీదు, షాహిపేట	7.00
అయేషా మసీదు, అయేషానగర్	7.00
రోషన్ మున్వర్ మసీదు, జిల్లా కోర్టు ఎదుట	9.00
యాకుబ్‌సాబ్ మసీదు, కృష్ణా సర్కిల్	10.00
ఇబ్రహీం ఖలీలుల్లా మసీదు, హబీబుల్లావీధి	7.00
హుజ్రా మసీదు, రవీంద్రనగర్	8.30
హౌస్ మసీదు, హౌస్ వీధి	8.30
అంజదియా మసీదు, చాంద్‌ఫిరా గుంబద్‌వీధి	8.00
నూరాని మసీదు, బుచ్చర్ వీధి	8.00
గౌస్ ఆజం మసీదు, గౌస్‌నగర్	7.00
జులేఖాబి మసీదు, రమేష్ థియేటర్ ఎదురుగా	8.30
అబూబకర్ సిద్దిఖి మసీదు, నెహ్రూ పార్కువద్ద	6.30
రాజాఖాన్ భాగ్ మసీదు, మోచంపేట	9.00
ఫరూఖ్ మసీదు, గౌస్‌నగర్	6.30
గఫ్ఫారియా మసీదు, ఏ-1 నగర్	6.30
యతీంఖాన మసీదు, మద్రాసురోడ్డు	8.00
హాజీరా మసీదు, దస్తగిరి జెండామాను	9.00
బ్యాంకు మదీన మసీదు, కోటిరెడ్డివీధి	8.30
మహమ్మదియా మసీదు, రాజారెడ్డివీధి	9.30
నాగూర్‌బాష దర్గా మసీదు, వినాయక సర్కిల్	7.30
ఇనాయత్‌ఖాన్ తాలిం మసీదు, అగాడి	8.00
బుఖారియా మసీదు, రవీంద్రనగర్	6.15
మదార్ మసీదు, తాజ్‌నగర్	8.30
సలీంమున్నీసా మసీదు, ట్రంకురోడ్డు	8.30
మక్కా మసీదు, రవీంద్రనగర్	9.00
నబవి మసీదు, మృత్యుంజయకుంట	8.00
ధనమండి మసీదు, బీకేఎం వీధి	9.00
అక్సా మసీదు, నాగరాజుపేట	8.00
అష్రఫియా మసీదు, అప్సర్‌ఖాన్ కాలనీ	10.00
అబ్దుల్ సత్తార్‌మసీదు, బెల్లంమండివీధి	7.00
నూర్ మసీదు, మరాఠీవీధి	7.30
ఖజీర్ మసీదు, ఖలీల్‌నగర్	7.00
అన్వరుల్లా మసీదు, ఏ-1 నగర్	7.30
మరియం మసీదు, అల్మాస్‌నగర్	7.15
మహబూబియా మసీదు, రైల్వేస్టేషన్‌రోడ్డు	7.30
మహబూబే ఇల్లాహి మసీదు, మండిబజారు	6.20
ఏక్ మీనార్ మసీదు, మరాఠీవీధి	7.00
ఏ-1 బదర్ మసీదు, శంకరాపురం	7.30
అహ్మదియా మసీదు, లోహియానగర్	6.30
అబ్దుల్లా హసీం మసీదు, బ్యాంకు కాలనీ	9.00
రబీబియా మసీదు, మోచంపేట	8.00
సాబీర మసీదు, బిస్మిల్లానగర్	9.00
హంజా మసీదు, నాగరాజుపేట	8.00
మహమ్మదీయ మసీదు, ప్రకాశ్‌నగర్	8.30
ఆజం ఖిల్లా మసీదు, రవీంద్రనగర్	8.00
అనాస్ మసీదు, మున్సిపల్ మైదానం	8.30
నూరాని మసీదు, భాకరాపేట	8.00
సిద్దిఖ్ మసీదు, గరీబ్‌షావీధి	7.00

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి
– కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప అర్బన్: కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అని, ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తెలిపారు. ఏదైనా సమస్య వస్తే నోడల్ ఆఫీసర్‌కు లేదా సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బక్రీద్ పండుగ నిర్వహణకు అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ముస్లిం సోద రులకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు.